# ప్రతిభ




ద్వైమాసిక పత్రిక సంచిక-3
(నవంబర్, డిసెంబర్ )


తెలుగు శాఖ

## వివేకానంద ప్రభుత్వ డిగ్రీ కళాశాల, విద్యానగర్



దేశభాషలందు తెలుగు లెస్స





*మనం ఒక్క క్షణంలో కోల్పోయినదాన్ని తిరిగి ఒక్క దశాబ్దంలో కూడా పొందలేకపోవచ్చు*

*- దేవులపల్లి కృష్ణశాస్త్రి*

# ప్రతిభ

## ద్వైమాసిక పత్రిక (నవంబర్, డిసెంబర్)

**గౌరవ సంపాదకులు:**
డా. జి సుకన్య గారు,
ప్రధానాచార్యులు

**ప్రధాన సంపాదకులు:**
డా.జె. భారతి,
తెలుగు శాఖ అధ్యక్షులు

**సంపాదక సహకారం:**
తెలుగు శాఖ అధ్యాపకులు
మరియు
కళాశాల తెలుగు సంఘం విద్యార్థులు



కళాశాల వ్యవస్థాపకులు
ఆచార్య ఖండవల్లి లక్ష్మీరంజనం గారు

**లోపలి పుటల్లో...**

ఆలోకన...3
ముఖచిత్ర పరిచయం...4
పోటీ పరీక్షలకు తెలుగు...5
పదకేళి...9
సాహిత్య రత్నాలు...10
బాలల దినోత్సవం...16
దీపావళి ప్రత్యేకత...17
మీకు తెలుసా!...19
ఓ మంచి పద్యం...20
పదవినోదం...21
కళాశాల వార్తా కదంబం...22

నూరు పువ్వులు వికసించనీ వెయ్యి ఆలోచనలు సంఘర్షించనీ

# ఆలోకన

'స్పర్ధయా వర్ధతే విద్యా'

స్పర్ధ అంటే పోటీ , విద్ అంటే జ్ఞానం పోటీ వలన జ్ఞానాభివృద్ధి కలుగుతుందని భావం. విద్యార్జన ఆధిక్య నిరూపణ కోసం కాకూడదు. ఇటు వ్యక్తిత్వం అటు సామాజిక జీవితం రెండింటిలోనూ ఉన్న స్థితి నుండి ఉన్నత స్థితి చేరేందుకు విద్యార్జన చేయాలి. ప్రతి విద్యార్థి ఇందుకు పోటీపడాలి.

ప్రస్తుత కాలంలో పోటీ జ్ఞానాభివృద్ధికి పరిమితంకాక ఎన్నో విషయాలకు విస్తరించింది. దీని వలన అతి చిన్న వయసు నుండి విద్యార్థి విపరీతమైన ఒత్తిడిని ఎదుర్కొంటున్నాడు. ఒత్తిడి విపరీత ప్రవర్తనలకు దారి తీయిస్తోంది.


విద్యా దదాతి వినయమ్ అంటారు పెద్దలు. విద్య వినయాన్ని పెంచాలి కానీ నేడు చదువును వెన్నంటే అహంకారం ఉంటోంది. అహంకారం స్వీయనాశనానికి కారణమౌతుంది. మహాభారతంలో యవక్రీతుడనే వాడి కథ ఇందుకు చక్కని ఉదాహరణ. డిగ్రీలు పొందేందుకు చదవటం కాకుండా వ్యక్తిగత సంస్కారాన్ని పెంచుకునేందుకు చదువును పునాదిగా చేసుకోదలచిన విద్యార్థులకు వివేకానంద డిగ్రీ కళాశాల తెలుగు శాఖ ఈ ద్వైమాస పత్రిక ద్వారా సహకరిస్తోంది. ఇందులో పోటీ పరీక్షలకు కావాల్సిన తెలుగు సాహిత్య, చారిత్రక సంస్కృతీ విషయాలతో పాటు తెలుగు భాష నైపుణ్యాన్ని పెంచే పదక్రీడలను కూడా అందిస్తున్నాం. ఈ పత్రికను అందరికి చేర్చేందుకు సహకరిస్తున్న కళాశాల పూర్వవిద్యార్థి చి. అభిలాష్ కు అభినందనలు. ఉన్నత భవిష్యత్తును ఆకాంక్షించే విద్యార్థుల కోసం తీసుకువస్తున్న ఈ పత్రికను అందుకు పునాదిగా మలచుకుంటారని ఆశిస్తున్నాను.

ప్రధాన సంపాదకులు

# ముఖచిత్ర పరిచయం


1 నవంబర్ 1897న జన్మించి, ఆకులో ఆకునై, పూవులో పూవునై, కొమ్మలో కొమ్మనై... అంటూ, విలువకట్టలేని సాహిత్య మణి పూసలను మనకందించిన ఆంధ్రా షెల్లీ **శ్రీ దేవులపల్లి కృష్ణశాస్త్రి** గారి గురించిన పూర్తి వివరాలు లోపలి పుటల్లో తెలుసుకోండి





1890 నవంబర్ 16 న జన్మించి, తెలంగాణ సంస్కృతి, చరిత్రపై విశేష పరిశోధన చేసిన **ఆదిరాజు వీరభద్రరావు** గారి జీవిత విశేషాలను లోపలి పుటల్లో తెలుసుకోండి.

1922 డిసెంబర్ 16న జన్మించి వచనకవితా పితామహుడుగా ప్రసిద్ధి చెందిన **కుందుర్తి ఆంజనేయులు గారిని** గురించిన మరిన్ని జీవిత విశేషాలను లోపలి పేజీల్లో తెలుసుకోండి.



# పోటీ పరీక్షలకు తెలుగు ప్రశ్నావళి

పోటీ పరీక్షలను ఉద్దేశించి తయారుచేసిన తెలుగు సాహిత్య క్విజ్ లో పొల్గొని కొత్త విషయాలను తెలుసుకోండి..!

**1. అద్దంకి శాసనం వేయించింది ఎవరు?**

అ) నన్నయ

ఆ) పండరంగడు

ఇ) గుణగణాధిత్యుడు

ఈ) హాలుడు

**2. అమరావతి స్తూపంలో గల తెలుగు పదం?**

అ) నాగబు

ఆ) చెరువు

ఇ) అత్త

ఈ) పాడి

**3. బృహత్కథ రాసింది?**

అ) విశ్వవర్మ

ఆ) గుణాఢ్యుడు

ఇ) శ్రీనాథుడు

ఈ) హాలుడు

**4. బెజవాడ శాసనం వేయించింది?**

అ) విక్రమాధిత్యుడు

ఆ) యుద్ధమల్లుడు

ఇ) విజయ రాఘువ నాయకుడు

ఈ) రఘు నాధ నాయకుడు

**5. గూడూరు శాసనం ఎవరి పేరున ఉంది?**

అ) విరియాల కామసాని

ఆ) ముత్యాలమ్మ

ఇ) పెరిందేవి

ఈ) రామాయమ్మ

**6. పైశాచిక భాషలోని గ్రంథం?**

అ) స్వారోచిషమనుసంభవం

ఆ) గాథాసప్తశతి

ఇ) బృహత్కథ

ఈ) కిరాతార్జునీయం

**7. నన్నయ వేయించిన శాసనం?**

అ) కుర్క్యాల శాసనం

ఆ) నందంపూడి శాసనం

ఇ) విప్పర్ల శాసనం

ఈ) అమరావతి శాసనం

**8. పండరంగడు ఎవరి సేనాని?**

అ) గుణగవిజయాదిత్యుడు

ఆ) యుద్ధమల్లుడు

ఇ) ధనుంజయుడు

ఈ) రాజరాజ నరేంద్రుడు

**9. ప్రాగ్నన్నయ యుగపు భాష తెలుసుకోవడానికి ఆధారాలు?**

అ) తాళపత్ర గ్రంథాలు

ఆ) కావ్యాలు

ఇ) శాసనాలు

ఈ) నాణేలు

**10. యుద్ధమల్లుని బెజవాడ శాసనంలో గల పద్యాలు ఏ ఛందస్సులో ఉన్నాయి?**

అ) సీసం

ఆ) ద్విపద

ఇ) మధ్యాక్కర

ఈ) కందం

**11. అద్దంకి శాసనంలో గల పద్యాలు ఏ ఛందస్సులో ఉన్నాయి?**

అ) ఆటవెలది

ఆ) కందం

ఇ) మత్తకోకిల

ఈ) తరువోజ

**12. గుణాఢ్యుడితో వాగ్వివాదానికి దిగింది ఎవరు?**

అ) విష్ణుశర్మ

ఆ) విజయవర్మ

ఇ) నిగమశర్మ

ఈ) విశ్వవర్మ

**13. గూడూరి శాసనంలోని పద్యాలు ఏ శాసనంలో ఉన్నాయి?**

అ) కందం

ఆ) ఆటవెలది

ఇ) ఉత్పలమాల, చంపకమాల

ఈ) మధ్యాక్కర, తరువోజ

**14. మొట్టమొదటి పద్యశాసనం ఏ రాజు కాలానికి చెందింది?**

అ) విక్రమాదిత్యుడు

ఆ) రాజరాజ నరేంద్రుడు

ఇ) గుణగవిజయాదిత్యుడు

ఈ) విష్ణువర్ధనుడు

**15. తలమళ్ల శాసనం వేయించినది?**

అ) రేనాటి చోళులు

ఆ) విక్రమాదిత్యుడు

ఇ) ధనంజయుడు

ఈ) విష్ణువర్ధనుడు

**16. తలమళ్ల శాసనం ఏ ప్రక్రియకు చెందింది?**

అ) గద్యం

ఆ) పద్యం

ఇ) చంపూ

ఈ) నాటకం

**17. తామ్ర శాసనాలు అనగా?**

అ) తాటాకులపై రాసిన శాసనాలు

ఆ) శిలలపై చెక్కిన శాసనాలు

ఇ) లోహాలపై రాసిన శాసనాలు

ఈ) కాగితంపై రాసిన శాసనాలు

**18. పైశాచిక భాష అనగా?**

అ) రాజుల భాష

ఆ) గిరిజనుల భాష

ఇ) దేవతల భాష

ఈ) అసురుల భాష

**19. సీస పద్య రూపం కనిపిస్తున్న శాసనం?**

అ) గూడూరు శాసనం

ఆ) విప్పర్ల శాసనం

ఇ) అద్దంకి శాసనం

ఈ) చాళుక్య భీమరాజు ధర్మావరం శాసనం

**20. తెలుగు పదాలు ప్రవేశించిన ప్రాకృత భాషా కావ్యం ఏది?**

అ) నాట్యశాస్త్రం

ఆ) గాథాసప్తశతి

ఇ) బృహత్కథ

ఈ) వినయపీఠకం

## సమాధానాలు

| | | | |
|---|---|---|---|
| 1-ఆ | 6-ఇ | 11-ఈ | 16- అ |
| 2-అ | 7-అ | 12-ఈ | 17-ఇ |
| 3-ఆ | 8-అ | 13-ఇ | 18-అ |
| 4-ఆ | 9-ఇ | 14-ఇ | 19-ఈ |
| 5-అ | 10-ఇ | 15- ఇ | 20-ఇ |

# పదకేళి

## తప్పొప్పులు

కింది పదాలలో ఏవి సరైనవో గుర్తించండి

1. పేలవమైన( ) పేవలమైన( )
2. రధం ( ) రథం( )
3. ప్రత్యర్ధి ( ) ప్రత్యర్థి ( )
4. క్రోధం( ) క్రోదం ( )
5. బోధన( ) భోదన ( )
6. దృఢత్వం( ) ధృఢత్వం( )
7. బంధం( ) భందం( )
8. స్వేచ్ఛ( ) స్వేచ్చ ( )
9. సామర్థ్యం( ) సామర్ధ్యం( )
10. వ్యతిరేఖం( ) వ్యతిరేకం( )

సమాధానాలు: తదుపరి పత్రికలో

**ప్రతిభ- ద్వైమాస పత్రిక (సెప్టెంబర్, అక్టోబర్)**
**పదకేళి సమాధానాలు**

కింది పదాలలో ఏవి సరైనవో గుర్తించండి

1. గాఢత
2. పరాకాష్ఠ
3. ప్రత్యర్థి
4. అనాధ
5. సమైక్య
6. ప్రస్తావన
7. సిబ్బంది
8. విశిష్ట
9. నేపథ్యం
10. పారవం

# దేవులపల్లి కృష్ణశాస్త్రి



తెలుగు భావ కవితా రంగంలో ఒక ముఖ్య అధ్యాయం **దేవులపల్లి కృష్ణశాస్త్రి.** ఆయన రేడియాలో లలితగీతాలు, నాటికలు, సినిమాల్లో పాటలు రాయడం ద్వారా ప్రఖ్యాతి పొందారు. చిన్న వయసునుండే రచనలు రాయడం ప్రారంభించారు. 1929 లో రవీంద్రనాథ్ ఠాగూర్ ను కలసిన తరువాత ఆయన కవిత్వంలో భావుకత వెల్లివిరిసింది. 1945లో ఆకాశవాణిలో చేరి అనేక పాటలు, నాటికలు కూడా రచించారు.

దేవులపల్లి కృష్ణశాస్త్రి తూర్పు గోదావరి జిల్లా, పిఠాపురం దగ్గరలోని చంద్రపాలెం అనే గ్రామంలో ఒక పండిత కుటుంబంలో 1897 నవంబరు 1న జన్మించారు. అతని తండ్రి, పెదతండ్రి గొప్ప పండితులు. వారింట్లో నిరంతరం ఏదో సాహిత్యగోష్ఠి జరుగుతూ ఉండేది. కృష్ణశాస్త్రి చిన్న వయసునుండే రచనలు ఆరంభించారు. పిఠాపురం హైస్కూలులో అతని విద్యాభ్యాసం సాగింది. పాఠశాలలో తన గురువులు కూచి నరసింహం, రఘుపతి వెంకటరత్నం ఆంగ్ల సాహిత్యంలో తనకు అభిరుచి కల్పించారని దేవులపల్లి చెప్పుకొన్నారు. 1918లో విజయనగరం వెళ్ళి డిగ్రీ పూర్తి చేసి తిరిగి కాకినాడ పట్టణం చేరారు. పెద్దాపురం మిషన్ హైస్కూలులో ఉపాధ్యాయవృత్తి చేపట్టారు.

ఆ కాలంలో వ్యావహారిక భాషావాదం, బ్రహ్మసమాజం వంటి ఉద్యమాలు ప్రబలంగా ఉన్నాయి. కృష్ణశాస్త్రి తన అధ్యాపకవృత్తిని వదలి బ్రహ్మసమాజంలో చురుకుగా పాల్గొన్నారు. అదే సమయంలో సాహితీ వ్యాసంగం కూడా కొనసాగించారు. 1920లో వైద్యంకోసం రైలులో బళ్ళారి వెళుతూండగా ప్రకృతినుండి లభించిన ప్రేరణ కారణంగా "కృష్ణపక్షం కావ్యం" రూపు దిద్దుకొంది. 1922లో భార్యా వియోగానంతరం ఆయన రచనలలో విషాదం అధికమయ్యింది.

## రచనలు:


- కృష్ణ పక్షము:
- ఊర్వశి
- అమృతవీణ - 1992 - గేయమాలిక
- అమూల్యాభిప్రాయాలు - వ్యాసావళి
- బహుకాల దర్శనం - నాటికలు,కథలు
- ధనుర్దాసు - నాలుగు భక్తీ నాటికలు,
- కృష్ణశాస్త్రి వ్యాసావళి - 4 భాగాలు
- మంగళకాహళి - దేశభక్తి గీతాలు
- శర్మిష్ఠ - 6 శ్రవ్య (రేడియో) నాటికలు
- శ్రీ ఆండాళ్ళు తిరుప్పావు కీర్తనలు, నాటిక 1993
- మేఘమాల - సినిమా పాటల సంకలనం - 1996
- శ్రీ విద్యావతి - శృంగార నాటికలు
- యక్షగానాలు - అతిథిశాల - సంగీత రూపకాలు
- మహతి
- వెండితెర పాటలు - 2008

## పురస్కారాలు:

- 1975 - ఆంధ్ర విశ్వవిద్యాలయం - కళాప్రపూర్ణ
- 1978 - సాహిత్య అకాడమీ అవార్డు
- 1976 - పద్మ భూషణ్

నవ్వివోదురు గాక నా కేటి సిగ్గు ? నా యిచ్చయే గాక నా కేటి వెరపు ? అంటూ ఎన్నో సినీగేయాలను రచించి తెలుగు సాహిత్యంలో చెరగని ముద్రవేసిన కృష్ణశాస్త్రి గారు 1980 ఫిబ్రవరి 24న తుది శ్వాస వదిలారు.

# ఆదిరాజు వీరభద్రరావు



తెలంగాణ ప్రాంతపు చరిత్ర, సంస్కృతిపై విశేష పరిశోధన చేసిన గొప్ప బాషా శాస్త్రవేత్త **ఆదిరాజు వీరభద్రరావు.**

ఇతను 1890 నవంబరు 16న ఖమ్మం జిల్లా, మధిర మండలం, దెందుకూరు గ్రామంలో ఒక బ్రాహ్మణ కుటుంబంలో జన్మించాడు. చిన్న వయస్సులో ఉన్నప్పుడే తండ్రి లింగయ్య మరణించారు. తల్లి వెంకమాంబ ఇతన్ని మంచి చదువు చదివించాలని తలచి దూరపు బంధువైన రావిచెట్టు రంగారావు ను ఆశ్రయించింది. రావిచెట్టు ప్రోత్సాహం, సహాయంతో ఆదిరాజు చాదర్‌ఘాట్ ఉన్నత పాఠశాలనుండి విద్యనభ్యసించి, రావిచెట్టు రంగారావు ఇంట్లో నెలకొల్పిన శ్రీ కృష్ణ దేవరాయాంధ్ర భాషా నిలయం గ్రంథాలయానికి తొలి గ్రంథపాలకుడిగా **ఆదిరాజు వీరభద్రరావు** నియమితులయ్యారు.

1908లో కొమర్రాజు లక్ష్మణరావు యొక్క విజ్ఞాన చంద్రికా మండలి హైదరాబాదు నుండి మద్రాసుకు తరలి వెళ్ళవలసి వచ్చిన తరుణంలో, లక్ష్మణరావు విజ్ఞప్తి మేరకు వీరభద్రరావు కూడా మండలిలో పనిచేయటానికి మద్రాసు వెళ్ళారు. మండలిలో పనిచేస్తున్న సమయంలో అనేక ప్రసిద్ధ రచయితలు, కవులు, పండితులు, పరిశోధకులతో పరిచయం ఏర్పడింది. లక్ష్మణరావుచే ప్రభావితుడై, ఆయన మార్గదర్శకత్వంలో చక్కని పరిశోధకునిగాను, బాధ్యతాయుత రచయితగాను శిక్షణ పొందాడు. 1914లో హైదరాబాదుకు తిరిగివచ్చి మహబూబ్ కళాశాలలో తెలుగు ఆచార్యునిగా నియమితులయ్యారు. ఆ తరువాత ఛాదర్‌ఘాట్ ఉన్నత పాఠశాలలోనూ, నారాయణగూడలోని బాలికోన్నత పాఠశాలలోనూ తెలుగు పండితునిగా పనిచేశారు. మర్రి చెన్నారెడ్డి ఇతని శిష్యులలో ప్రముఖుడు.


ఈయన శ్రీ కృష్ణ దేవరాయాంధ్ర భాషా నిలయంలో లైబ్రేరియన్‌గా, కార్యదర్శిగా, అధ్యక్షుడిగా పనిచేశారు. విజ్ఞానచంద్రిగా గ్రంథమాల కార్యాలయ ప్రముఖుడిగా, ఆంధ్ర జనసంఘ కార్యవర్గ సభ్యుడిగా, లక్ష్మణరాయ పరిశోధకమండలి కార్యదర్శిగా, ఆంధ్ర సారస్వతపరిషత్తు స్థాపక సభ్యుడిగా, ఆంధ్ర చంద్రికా గ్రంథమాల ప్రధాన సంపాదకుడిగా, విజ్ఞానవర్ధినీ పరిషత్తు సభ్యుడిగా, సంగ్రహాంధ్ర విజ్ఞానకోశ ప్రధాన సంగ్రాహకుడిగా, ఆంధ్రప్రదేశ్ సాహిత్య అకాడమీ విశిష్ట సభ్యునిగా ఇతడు తన సేవలను అందించారు.
అలనాటి దక్కన్ రేడియోలో తెలుగులో మొట్టమొదటి ప్రసంగం చేసిన ఘనత ఈయనకే దక్కింది.

1921లో తెలంగాణ సాహితీ సాంస్కృతిక వికాసానికై ఆంధ్ర పరిశోధక మండలి స్థాపించినప్పుడు దానికి కార్యదర్శిగా ఆదిరాజు పనిచేశారు. ఆ సంస్థ తెలంగాణ లోని పలు చారిత్రక ప్రదేశాలు, శిలా శాసనాలు, తాళపత్ర గ్రంథాలు సేకరించి "తెలంగాణ శాసనాలు" పేరిట పెద్ద గ్రంథాన్ని ప్రచురించుటలో ఆదిరాజు కృషి నిరుపమానమైనది.

కాకతీయ రాజ్య పతనానంతరం ఓరుగల్లును ఏలిన సీతాపతి (షితాబుఖాను) చరిత్రను వెలువరించారు. తెలంగాణ 9 జిల్లాల చరిత్రను, *భాగ్యనగరం* గ్రంథాలను కూడా రచించారు.

తెలుగు సాహిత్యానికి అపారమైన కృషి చేసిన ఆదిరాజు గారు 1973, సెప్టెంబరు 28 న పరమపదించారు.

# కుందుర్తి ఆంజనేయులు



వచన కవితా పితామహుడుగా ప్రసిద్ధి చెందిన **కుందుర్తి ఆంజనేయులు ప్రముఖ** అభ్యుదయ కవి, రచయిత. ఆంధ్ర ప్రాంతంలో వచన కవితా ఉద్యమానికి ఆద్యులు. కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు గ్రహీత. రగిలించే తమ కవిత్వంతో తెలంగాణా సాయుధ పోరాటానికి అజ్యం పోసిన కవులలో ప్రముఖుడు.

ఆంజనేయులు 1922, డిసెంబర్16న గుంటూరు జిల్లా కోటవారిపాలెం గ్రామం లోఒక బ్రాహ్మణ కుటుంబములో జన్మించారు.ఈయన వినుకొండలో చదువు కున్న కాలములో గుర్రం జాషువా ఈయనకు తెలుగు మాష్టారుగా ఉన్నారు. 1936 నుండి 1941 వరకు విజయవాడ పురపాలకసంఘ ఉన్నత పాఠశాలలో చదివారు. అక్కడే 1937లో కవిత్వం వ్రాయటం ప్రారంభించారు. విజయవాడ ఎస్.ఆర్.ఆర్.కళాశాలలో ఈయన విశ్వనాథ సత్యనారాయణ వద్ద శిష్యునిగా ఉన్నారు. ఆ తరువాత గుంటూరు ఆంధ్రా క్రైస్తవ కళాశాల నుండి బి.ఏ పట్టా పుచ్చుకున్నారు.

ఆంజనేయులు నరసరావుపేటలో నవ్యకళా పరిషత్తు స్థాపించారు. ఆ కాలంలోనే ఆయన కమ్యూనిష్టు భావాలకు ఆకర్షితుడయ్యారు. దేవేంద్రపాడు గ్రామములోని రెసిడెన్షియల్ పాఠశాలలో ఆంగ్ల ఉపాధ్యాయునిగా, ప్రిన్సిపాలుగా పనిచేసి,. ఆ తరువాత కొన్నాళ్ళు గుంటూరు పొగాకు మార్కెట్టులో పనిచేశారు. 1956లో కర్నూలులో సమాచార ప్రసారశాఖలో అనువాదకునిగా చేరి, ఆ తరువాత హైదరాబాదుకు బదిలీ అయ్యారు. 1958లో ఫ్రీవర్స్ ఫ్రంట్ స్థాపించారు. 1967లో యువతలో వచన కవిత్వాన్ని ప్రోత్సహించడానికి ఉత్తమ వచన కవిత్వానికి ఒక బహుమతి ప్రారంభించారు. 1977లో ఈయన ఉద్యోగ జీవితమునుండి విరమణ పొందాడు.

1944లో కందుర్తి అంజనేయులు ఏల్చూరి సుబ్రహ్మణ్యం, బెల్లంకొండ రామదాసులతో కలిసి మొట్టమొదటి కవితా సంకలనం *నయగారా* ప్రకటించారు. ఈ ముగ్గురూ నయగారా కవులుగా ఆధునిక తెలుగు సాహిత్యములో ప్రసిద్ధి చెందారు. అంజనేయులు సమగ్ర రచనలు 1974లో ప్రచురించబడినవి. కుందుర్తి అనేక పురస్కారాలు అందుకున్నారు. వాటిలో కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు, రాష్ట్ర సాహిత్య అకాడమీ అవార్డుతో పాటు 1969లో అందుకున్న సోవియట్ లాండ్ నెహ్రూ పురస్కారము ప్రతిష్ఠాత్మకమైనవి.

ఈయన రచనలలో *సౌప్తికం, రసధుని, అమావాస్య, నా ప్రేయసి, నయాగరా, తెలంగాణ, దండియాత్ర, ఆషా, నగరంలో వాన, నాలోని వాదాలు, హంస ఎగిరిపోయింది, తీరా నేనుకాస్త ఎగిరిపోయాక, మేఘమాల, ఇది నా జెండా, కుందుర్తి పీఠికలు, కుందుర్తి వ్యాసాలు, బతుకు మాట* మొదలైనవి ముఖ్యమైనవి. వచనాన్ని సాహిత్యముగా పరిగణించని రోజులలో కందుర్తి వచన కవిత్వాన్ని ప్రోత్సహించారు. కవిత్వము గతమని, వచన కవిత్వము వర్తమానమని చాటాడు.

1882లో వచనకవితా పితామహుడు కుందుర్తి తుదిశ్వాస విడిచారు.

ఆయన మరణించిన తరువాత ప్రముఖ సాహితీ సమితి రంజని ఆయన పేరిట 1984 నుంచి ఇప్పటి వరకు ఏటేటా వచన కవితల పోటీలు నిర్వహించి అవార్డులు ప్రకటిస్తూ ఉంది. మరణించిన తరువాత కూడా ఆయన యువ కవులకు ఈ విధంగా స్ఫూర్తిని ఇస్తూ ఉన్నారు.

# బాలల దినోత్సవం – నవంబర్ 14



భగవంతుడు ఇచ్చిన ఓ అమూల్యమైన వరం బాల్యం. అభం శుభం తెలియని ఆ పసి మనసులు పూతోటలో అప్పుడే పరిమళించిన పువ్వులు. అందుకు సూచకంగా ప్రపంచవ్యాప్తంగా ఆయా దేశాలలో **బాలల దినోత్సవాలు** జరుపుకుంటారు.

మనదేశంలోనూ బాలల దినోత్సవం జరుపుకుంటారు. మన దేశంలో ప్రతి సంవత్సరం నవంబరు 14 న **బాలల దినోత్సవం** జరుపుకుంటాము. భారత తొలి ప్రధాని జవహర్ లాల్ నెహ్రూ జన్మదినం రోజున ఈ ఉత్సవం జరుగుతుంది. నెహ్రూకు పిలల్లలతో వున్న బాంధవ్యాన్ని తెలుపుతూ ఈ ఉత్సవం జరుపుకుంటారు. పిల్లలు నెహ్రూను చాచా నెహ్రూ అని ప్రేమగా పిలిచేవారు. భారత తపాలా శాఖ ప్రతి సంవత్సరం ఈ రోజు తపాలా బిళ్ళను విడుదల చేస్తుంది.

ప్రపంచవ్యాప్తంగా ప్రతి సంవత్సరం బాలల దినోత్సవాన్ని నవంబర్ 20న అధికారికంగా జరుపుకుంటుంటారు. అయితే 1954కి ముందు అక్టోబర్ నెలలో బాలల దినోత్సవాన్ని జరుపుకునేవారు. ఐక్యరాజ్యసమితి నిర్ణయించిన ప్రకారం బాలల దినోత్సవాన్ని మొదటిసారిగా 1954లో ప్రపంచమంతటా నిర్వహించారు. 1959 నవంబర్ 20న బాలల హక్కుల ప్రకటనను ఐరాస సర్వసభ్య సభ రూపొందించిన సందర్భంగా బాలల దినోత్సవాన్ని ప్రపంచ మంతటా జరుపుకోవాలని నిర్ణయించారు. 1989లో పిల్లల హక్కులపై నవంబర్ 14న ఓ బిల్లును ఐరాస ఆమోదించింది. ఈ బిల్లును ఆమోదిస్తూ 191 దేశాలు సంతకాలు పెట్టాయి కూడా. పిల్లలు తమ భావాలను, సమాచారాన్ని పంచుకోవడాన్ని, పరస్పర అవగాహనను పెంచుకోవడాన్ని ప్రోత్సహించేందుకు గాను ఐక్యరాజ్య సమితి సర్వప్రతినిధి సభ బాలల దినోత్సవానికి రూపకల్పన చేసింది. ప్రపంచమంతటా పిల్లల సంక్షేమాన్ని ప్రోత్సహించేందుకోసం పలు చర్యలు చేపట్టడమే ఈ బాలల దినోత్సవం లక్ష్యం.

# చెడుపై మంచి విజయం - దీపావళి

దీపావళి.. చెడుపై మంచి సాధించిన విజయానికి గుర్తుగా జరుపుకునే పండుగ. ఇంట్లోకి నూతన వెలుగులు తీసుకొచ్చే మహత్తర పండుగ. అందరి ఆరోగ్యం, సంతోషాన్ని కోరుకునే పర్వదినం. మతంతో సంబంధం లేకుండా చాలా వరకు అందరూ కలిసి ఆనందోత్సాహంతో దీపావళి జరుపుకుంటారు. ఆశ్వయుజ బహుళ అమావాస్య రోజు ఈ పర్వదినం వస్తుంది. ఈ ఏడాది నవంబరు 14 శనివారం నాడు జరుపుకున్నాము. అయితే అసలు ఈ పండుగ విశిష్టత ఏంటి? పౌరాణిక చరిత్ర ఉందా? లాంటి ప్రశ్నలకు సమాధానం ఇప్పుడు తెలుసుకుందాం.





రామాయణంలోనూ దీపావళి ప్రస్తావన ఉంది. పురాణ కథనం ప్రకారం.. భూదేవి, వరహా స్వామికి అసుర సమయంలో జన్మించిన నరకాసురుడు.. శ్రీహరి చేతిలో చావులేని విధంగా తల్లి చేతిలోనే మరణించేలా వరం పొందుతాడు. వరగర్వంతో లోకకంటకుడిగా తయారైన నరకుడు ముల్లోకాలను పట్టిపీడించాడు. నరకాసురుడి బాధలు భరించలేని దేవతలు, మునులు, గంధర్వులు శ్రీహరికి తమ గోడు వెళ్లబోసుకున్నారు. వారి మొర ఆలకించిన శ్రీమహావిష్ణువు ద్వాపర యుగంలో కృష్ణుడిగా అవతరించి సత్యభామతో నరకాసురుని సంహరింపజేశాడు. నరకాసుర సంహారంతో అందరూ ఆనందంగా పండుగ చేసుకున్నారు. చతుర్దశి నాడు నరకుడు మరణించగా, ఆ తర్వాత రోజు దీపాలు వెలిగించి సంబరాలు చేసుకున్నారు. దీపావళి అంటే దీపాల వరుస అని అర్థం. కొన్ని ప్రాంతాల్లో దీపావళిని ఐదు రోజుల పండుగగా జరుపుకుంటారు. ఆశ్వయుజ బహుళ త్రయోదశితో ప్రారంభమైన దీపావళి వేడుకలు.. కార్తీక శుద్ధ విదియ 'భగినీహస్త భోజనం'తో ముగుస్తుంది.

పంచభూతాలలో ప్రధానమైనది అగ్ని. ఈ అగ్ని ప్రాణికోటి మనుగడకు ఉపకరించే తేజస్సును, ఆహారాన్ని ఐహికంగాను, విజ్ఞాన ధర్మగరిమను ఆధ్యాత్మికంగాను ప్రసాదిస్తుంది. ఈ దీపాల వెలిగింపు ద్వారా మూడు రంగులు ప్రధానంగా మనకు గోచరమవుతాయి. నీలము, పసుపు, తెలుపు- ఈ మూడు రంగులు మానవ మనుగడకు అవశ్యకమైన సత్త్వరజస్తమోగుణాల సమ్మేళనంగా ఆర్యులు చెబుతుంటారు. ఈ మూడు రంగులను జగతిని పాలించే లక్ష్మి, సరస్వతి, దుర్గలుగా భావిస్తారు పౌరాణికులు. అంతేకాక సత్యం-శివం-సుందరం - అని దీప ప్రజ్వలన ద్వారా త్రిజగన్మాతలను ఆరాధించినట్లును, మానవులకు విజ్ఞానం, వివేకం, వినయాలకు సంకేతమని సందేశాత్మకంగా గైకొంటారు భారతీయులు.

దీపావళి చుట్టూ అనేకానేక కథలు ఉన్నాయి. శ్రీకృష్ణుడు సత్యభామ సహకారంతో నరకాసురుణ్ణీ వధించాడు గనుక ప్రజలు ఆనందంతో మరునాడు దీపావళి సంబరం చేసుకుంటారని ఒక కథ. ఇంకో కథకూడా ఉంది. లంకలో రావణుని సంహరించి, రాముడు సీతాసమేతంగా అయోధ్యకు తిరిగి వచ్చినప్పుడు ప్రజలు ఆనందంతో ఈ పండుగ జరుపుకున్నారని చెబుతారు. ఉత్తరాదివారు ముఖ్యంగా వ్యాపారులు దీపావళి రోజును కొత్త సంవత్సరంగా పాటిస్తారు. ఆ రోజు లక్ష్మీదేవి పూజచేసి కొత్త ఖాతా పుస్తకాలు తెరుస్తారు. దీపావళి పండుగల్లాంటివే ప్రపంచంలోని అన్ని సమాజాల్లోనూ ఉన్నాయి.

దీపావళి కొన్ని ప్రాంతాల్లో అయిదు రోజుల పండుగగా జరుపుకుంటారు. ఆశ్వయుజ బహుళ త్రయోదశితో ప్రారంభమైన దీపావళి వేడుకలు, కార్తీక శుద్ధ విదియ భగినీహస్త భోజనంతో ముగుస్తాయి.దీపావళి అయిన రెండో రోజు చేసుకుంటారు.భారతదేశంతో పాటు నేపాల్‌లో కూడా జరుపుకొంటారు.ఈ రోజును పుష్ప ద్వితీయ, యమ ద్వితీయ, కాంతి ద్వితీయ, వంటి అనేక పేర్లతో పిలుస్తారు.భయ్యా ధూజ్ అనే పేరుతో ఉత్తరదేశంలో బాగా ప్రాచుర్యం పొందిన భగినీ హస్త భోజనం సోదరుని క్షేమానికి సంబంధించినది.

# మీకు తెలుసా!

వాక్కు అంటే మాట అని అర్థం. మాటలన్నీ కూర్చి రాగం కడితే పాట. పాడితే గేయం. పాటని రచయిత వ్రాస్తే, రాగం సంగీతకారులు కడితే, గానం గాయకులు చేస్తారు. ఈ మూడు పనులూ ఒక్కరే చేయగలిగితే వారిని వాగ్గేయకారులు అంటారు. అంటే పాటని రచించి స్వరపరిచి, పాడగలిగే వాళ్ళు అని అర్థం.

ఈ వాగ్గేయకారుల సంప్రదాయం ప్రాచీనం నుండి ఆధునిక కాలం వరకు విస్తరించి ఉంది. ప్రాచీన కాలంలో అన్నమయ్య, రామదాసు, త్యాగరాజు, క్షేత్రయ్య మొదలైన వారు గొప్ప వాగ్గేయకారులుగా ప్రసిద్ధి చెందారు. క్షేత్రయ్య మువ్వలోని వేణుగోపాల స్వామిపై మువ్వగోపాల పదాలు వ్రాశారు. అన్నమయ్య,రామదాసు,త్యాగరాజు లను తెలుగు వాగ్గేయకారత్రయంగా పిలుచుకుంటాం. అన్నమయ్య శ్రీ వేంకటేశ్వర స్వామి మీద ఎన్నో సంకీర్తనలు రాశారు. అలాగే "తందనాన అహి తందనాన పురే" అంటూ సమాజ శ్రేయస్సుకు పాటుపడ్డారు. భద్రాచల రామదాసుగా పేరొందిన కంచెర్ల గోపన్న కూడా శ్రీరాముడి మీద ఎన్నో సంకీర్తనలను వ్రాశారు. ఈయన కీర్తనలు మొత్తం కూడా భక్తితో కూడినవి. త్యాగరాజు గారి కీర్తనలు కర్ణాటక సంగీత సాంప్రదాయంలో అతిప్రసిద్ధమైనవి. నాదోపాసన ద్వారా భగవంతుని తెలుసుకోవచ్చని నిరూపించిన వాగ్గేయకారుడు త్యాగరాజు.

ఆధునిక కాలంలో కూడా సుద్దాల హనుమంతు, గోరటి వెంకన్న, మంగళంపల్లి బాలమురళీకృష్ణ, అందెశ్రీ, గద్దర్, జయరాజు మొదలయిన వాగ్గేయకారులు సమాజంలోని వివిధ సమస్యలను తమ ధోరణిలో సమాజాన్ని చైతన్యపరుస్తున్నారు.

# ఓ మంచి పద్యం

## పద్యం:

**తల్లీ! నిన్ను దలంచి పుస్తకము చేతస్ బూనితిస్ నీవు నా
యుల్లంబందున నిల్చి జృంభణముగా నుక్తుల్ సుశబ్దంబు శో
భిల్లస్ బల్కుము నాదు వాక్కునను సంప్రీతిస్ జగన్మోహినీ!
ఫుల్లబ్జాక్షి !సరస్వతీ !భగవతీ !పూర్ణేందు బింబాననా!**

## భావం:

అమ్మా సరస్వతీమాత! పుస్తకం పట్టుకోడానికి ముందు నిన్ను మనసున స్మరించి, పిమ్మట చదువు మొదలుపెడుతున్నాను తల్లీ! ఓ వికసించిన కలువల వంటి విజ్ఞానము ప్రసరించే కన్నులు కల తల్లీ! నిండు చంద్రుని వంటి మోము కల చల్లని తల్లీ! జగన్మోహిని! నా ఉల్లము (మనసు) నందు ఉండి, నా వాక్కులు సుశబ్దాలుగా శోభిల్లాలని ప్రీతితో పలుకు తల్లీ!
పూర్వం ఈ పద్యాన్ని పఠించి సరస్వతి మాతను స్మరించిన తర్వాతనే పుస్తక పఠనం చేసేవారు. ఈ పద్యాన్ని ప్రస్తుతం ప్రార్థనా పద్యంగా వాడుతూ ఉంటాము.

ఇది కొన్నిప్రచురణ సంస్థలు గ్రంథానికి ముందు చేర్చిన ప్రార్థన పద్యాలలో ఇవ్వడంతో; ఈ చాటువును పోతన ప్రణీతమనీ వారి భాగవతములోనిది అనీ భావిస్తూ ఉంటారు. నిజానికి ఈ చాటువు వ్రాసినది ఎవరో తెలియదు.

# పదవినోదం

| | | | | |
|---|---|---|---|---|
| 1. | | 2. | | |
| | 3. | | | |
| 4. | | 5. | | |
| | 6. | | 7. | 8. |
| | | | | |

**అడ్డం:**

1. గబ్బిలం రచయిత(3)
2. వాన తర్వాత వచ్చేది(3)
3. ..........శూర కర్ణ(4)
5. జన్మదినం(3)
6. నూనె గింజల పంట(3)
7. మాల(2)

**నిలువు:**

1. జనకుని కూతురు(3)
2. నీటి నుండి పుట్టినది(3)
3. బాట, మార్గం (2)
4. సూర్యుడు ప్రసరించేది (3)
5. అలనాటి నటి ఇప్పటికీ ఉంది(3)
6. పత్రం (2)
7. ఏనుగు కొమ్ము(2)
8. ఒకరకమైన వాయిద్యం(2)

సమాధానాలు: తదుపరి పత్రికలో

# కళాశాల వార్తా కదంబం




డిగ్రీ మొదటి సంవత్సరం విద్యార్థులకు ఓరియంటేషన్ కార్యక్రమం






క్రీడల పోటీలు









ఫ్రెషర్ డే వేడుకలు




## జువాలజీ శాఖ ఆధ్వర్యంలో మానసిక ఆరోగ్యం -వర్క్ షాప్


## తెలుగు శాఖ ఆధ్వర్యంలో వికీపీడియా కార్యశాల – ముఖ్య అతిథిగా శ్రీ కశ్యప్, తెలుగు వికీపీడియా












పుస్తక ప్రదర్శన సందర్శన-ఫీల్డ్ ట్రిప్ -
తెలుగు శాఖ








మన ఊరు -మన చరిత్ర ప్రాజెక్టు అవగాహనా సదస్సు- ముఖ్య అతిథి -డా. కోయి కోటేశ్వరరావు, తెలుగు అసిస్టెంట్ ప్రొఫెసర్, సిటీ కళాశాల




రాజ్యాంగ దినోత్సవం సందర్భంగా ఎక్స్ టెన్షన్ లెక్చర్ - పొలిటికల్ సైన్స్ విభాగం




NSS విభాగం ఆధ్వర్యంలో సిటీ పోలీస్ వారి చే మాదకద్రవ్య నిరోధకత -అవగాహనా సదస్సు



కాకతీయుల కాలంలో క్రీస్తు శకం 1213లో నిర్మించిన **రామప్ప దేవాలయానికి** ప్రపంచ వారసత్వ హోదా దక్కింది. చైనాలోని ఫూజౌలో నిర్వహించిన యునెస్కో హెరిటేజ్ కమిటీ సమావేశాలలో ప్రపంచం వ్యాప్తంగా 21 దేశాల ప్రతినిధులు ఓటింగ్ ప్రక్రియలో పాలుపంచుకొన్నారు. 17 దేశాల వారు రామప్పకు అనుకూలంగా ఓటు వేశారు. రామప్పకు వారసత్వ హోదా ఇచ్చే విషయంపై నిర్ణయం తీసుకున్నారు. 2021 జులై 25న ప్రపంచ వారసత్వ సంపదగా ప్రకటించబడింది.

ప్రాచీన కట్టడమైన రామప్ప దేవాలయానికి వారసత్వ హోదా గుర్తింపునకు ముఖ్యంగా మూడు అంశాలను ఆధారంగా చేసుకుని కేంద్ర ప్రభుత్వం యునెస్కోకు నామినేట్ చేసింది. అవి:

- **ఇసుకపై ఆలయాన్ని నిర్మించడం**
- **నీటితో తేలియాడే ఇటుకలతో గోపురాన్ని నిర్మించడం.**
- **ఆలయ నిర్మాణానికి వాడిన రాయి నేటికీ రంగును కోల్పోకుండా ఉండడం.**